క్లుప్తంగా

రైతన్నల సాగునీటి అవస్థలు



ఉప్పలగుప్తంలో చేనుకు ఇంజిన్ సహాయంతో నీటిని వదులుతున్న రైతులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా గ్రామాల్లో రబీ సాగు చేస్తున్న రైతన్నలు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, కూనవరం, పేరాయిచెరువు, వానపల్లిపాలెం, చల్లపల్లి ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీరు అందక ఇంజిన్లతో సాగునీటిని అందిస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులకు మొరపెట్టుకున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



మహా గణపతి, అభయాంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న పండితులు

అల్లవరం: దేవగుప్తం సెంటర్లో మహా గణపతి, 12 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. వేద పండితులు పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధ్వర్యంలో పెచ్చెట్టి జానకిరామయ్య, పుల్లమ్మ మనవళ్లు జానకిరామయ్య, పట్టాభి రామ్ కుమార్, రాంబాబు, లక్ష్మీనారాయణ, నాని దంపతులచే ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం, మహా పూర్ణాహుతి, స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

జాబ్‌మేళాలో 28 మందికి నియామక పత్రాలు



జాబ్‌మేళాలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో అమలాపురంలోని ఏఎస్ఎన్ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని ట్రస్టు చైర్మన్ పవన్ తెలిపారు. వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 28 మంది ఎంపిక కాగా, వీరికి నియామక పత్రాలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రవీంద్ర, ఆకొండి చాణక్య, జేపీసీ ప్రతినిధులు వాణి, వాడ్రేపు శ్రీరామ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

అమలాపురం టౌన్: స్థానిక మహిపాల వీధిలో వేంచేసి యున్న లక్ష్మీ గణపతి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన తదితర పూజలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమం వైభవంగా జరిగింది. గరిక పూజ, విశేష పూజలు గావించారు. బలభద్రుని సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మీ అన్నపూర్ణ దంపతులు, సత్య శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులచే పూర్ణాహుతి జరిగింది. ఆలయ అర్చకులు ఈమని సాయికృష్ణ ఆధ్వర్యంలో వేద పండితులు పూజా క్రతువులు నిర్వహించారు.

12న వార్షిక బడ్జెట్ సమావేశం

యానాం: 2025–26 ఏడాదికి గానూ పుదుచ్చేరి వార్షిక బడ్జెట్ సమావేశం ఈ నెల 12న జరగనుంది. ఈ సందర్భంగా సీఎం రంగసామి బడ్జెట్‌ను సభలో ప్రవేశ పెట్టనున్నారు. ఆ రోజు ఎల్జీ కైలాష్‌నాథన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా అసెంబ్లీలో మాట్లాడనున్నారు. ఇప్పటికే 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సంబంధించి ఆర్థిక నివేదికను ప్లానింగ్ బోర్డు స్థానంలో తీసుకువచ్చిన కన్సల్టేటివ్ కమిటీ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆమోదించింది. దానిని కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపగా అక్కడ నుంచి ఆమోదం లభించింది. 2024–24 ఆర్థిక సంవత్సరానికి రూ.12,700 కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టగా దానిని రూ.13, 235కోట్లకు పెంచారు. అయితే ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్ మరో రూ.500 కోట్లకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. బడ్జెట్ సమావేశానికి సంబంధించి ఇప్పటికే తనకు ఆహ్వానం అందిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

సాయి సేవకులు.. స్ఫూర్తి ప్రదాతలు

- విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరాలు
- పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాలు
- కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందడుగు
- ఆదర్శంగా నిలుస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు
- బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



అమలాపురంలోని ఓ కాలనీలో మొక్క నాటుతున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఓ వైపు విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, మరో వైపు పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతూ అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సమితి ఆదర్శనీయ సేవలకు చిరునామాగా నిలుస్తోంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని ఆ సమితి ప్రతినిధులు, సేవకులు, వైద్యులు ఓ పక్క విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూనే మరో పక్క పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చని మొక్కలు నాటుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో పునీతులవుతున్నారు. సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకొని డివిజన్ పరిధిలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 100 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో వివిధ పాఠశాలల్లో 75 వైద్య శిబిరాలను పూర్తి చేశారు. మరో 25 శిబిరాలను పూర్తి చేసే దిశగా ఆ సేవా సమితి ప్రతినిధులు, ముఖ్యంగా వైద్యులు ఆయా గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ వైద్య శిబిరాలకు అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల సమితి కో ఆర్డినేటర్, చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిపుణుడు డాక్టర్ జి.ప్రభాకర్ సారథ్యం వహిస్తున్నారు.

విద్యార్థులకు తరుచూ వచ్చే వ్యాధుల పట్ల వైద్యులు స్పందించి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 2,500 మంది విద్యార్థులకు శిబిరాల ద్వారా ఉచిత వైద్యసేవలు అందించారు. మరో వెయ్యి మంది విద్యార్థులకు వైద్య సేవలు అందించనున్నారు. వైద్య సేవలు అందించే వైద్యులంతా అమలాపురం పట్టణానికి చెందిన వారే. వైద్యులు చంద్రమౌళి, పూజిత, సంతోష్, భావని, అమృతవల్లి, సునీల్, రామలింగరాజు, పుల్లయ్యనాయుడు, మంజీరా, రేవతి తదితర వైద్యులు ఈ ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ బృందం ఆయా గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో వ్యాధి తీవ్రత ఉన్న విద్యార్థులను గుర్తించి అమలాపురంలోని తమ క్లినిక్‌లకు రప్పిస్తున్నారు. వారికి మందులు, వైద్య పరికరాలు ఉచితంగా అందిస్తున్నారు. ఇలా దాదాపు 80 మంది విద్యార్థులకు ప్రత్యేక వైద్యం అందించారు.

ఆ రెండే లక్ష్యాలు



సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా అమలాపురంలో డివిజన్‌లో ఇప్పటికే మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేశాం. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు సంబంధించి పిల్లలకు తరుచూ సోకే వ్యాధుల పట్ల అప్రమత్తమై ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. 100 శిబిరాలకు గానూ ఇప్పటికే 75 పూర్తి చేశాం. రానున్న రెండు వారాల్లో మిగిలిన 25 వైద్య శిబిరాలను పూర్తి చేసి విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతాం.

– డాక్టర్ ప్రభాకర్, కోఆర్డినేటర్, సత్యసాయి సేవా సమితి, అమలాపురం డివిజన్

కోటి మొక్కలు నాటడమే లక్ష్యం

సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కోటి మొక్కలు నాటాలన్న లక్ష్యంతో డివిజన్‌లో సమితి సభ్యులు ఇప్పటికే దాదాపు వెయ్యి మొక్కలను నాటారు. సమితి సేవకులు తమ ఇళ్ల వద్ద, కాలనీల్లో మొక్కలు నాటారు. ఇప్పటికే మొక్కలు నాటిన సమితి సేవకులు ప్రస్తుతం విద్యార్థులకు వైద్య సేవలు అందించే ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో నిమగ్నమయ్యారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల సమితి అధ్యక్షుడు అడబాల కొండబాబు, సత్యసాయి బాలవికాస్ జిల్లా గురువు శిష్టా గుణ రంజన్ తదితరులు ఈ సేవా క్రతువులో భాగస్వాములవుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



గాడలంకలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం గాడిలంకలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రామస్తులు, భక్తుల విరాళాలతో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సోమవారం మహోత్సవాలు ప్రారంభమవుతాయి. మూడు రోజులపాటు వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించి బుధవారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరుగనుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



అలరించిన చిన్నారుల నృత్యాలు

యానాం: విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు కృషి చేయాలని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీవేద పాఠశాల వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ కరికులమ్ బోధన సాగుతుందని భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయనే ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ కోర్సుకు సంబంధించి మెటీరియల్‌ను అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ గుత్తుల జయరామారావు, సర్వశిక్షా అభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, రిటైర్డ్ విద్యాశాఖాధికారి రాచర్ల డేవిడ్‌రాజు, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, రిటైర్డ్ టీచర్ వీరభద్రరావు పాల్గొన్నారు.

నేడు వీహెచ్‌పీ నిరసన ప్రదర్శన

అమలాపురం టౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి ఆలయ ఉత్సవంలో హిందువులపై జరిగిన దాడికి నిరసనగా జిల్లా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో అమలాపురంలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టినట్లు ఆ సంస్థ జిల్లా శాఖ ఓ ప్రకటనతో తెలిపింది. ఇందు కోసం చలో అమలాపురం పిలుపును సైతం ఇచ్చింది. అమలాపురం నల్లవంతెన నుంచి జిల్లా కలెక్టరేట్ వరకూ సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు ఇవ్వనున్నట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని హిందూ బంధువులంతా విధిగా హాజరై విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.24 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఆదివారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఈ చెక్కులను అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని ముమ్మిడివరం, తాళ్ళరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు ఈ సాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, టేకుముడి లక్ష్మణ రావు, దొమ్మేటి రమణ కుమార్, ధూళిపూడి వెంకటరమణ, సంగాని వెంకటేష్‌లు పాల్గొన్నారు.

క్రియేటివ్ ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించిన డీఎస్పీ



కాట్రేనికోనలో క్రియేటివ్ ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తున్న అమలాపురం డీఎస్పీ ప్రసాద్

కాట్రేనికోన: కాట్రేనికోనలో ఆర్ట్స్ గ్యాలరీని ఆదివారం అమలాపురం డీఎస్పీ ప్రసాద్ ప్రారంభించారు. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలానికి చెందిన క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి ఆధ్వర్యంలో కాట్రేనికోనలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇవ్వడం, వారు చిత్రీకరించిన చిత్రాలను ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించడం ద్వారా ప్రతిభ చాటి చెప్పేందుకు దోహద పడుతుందన్నారు. సుమారు 60 మంది చిత్రకారులు సందర్శనకు హాజరయ్యారు. పాలకొల్లుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు మార్లపూడి ఉదయ కుమార్‌ను కళా తపస్వి బిరుదుతో క్రియేటీవ్‌ఆర్ట్స్ సంస్థ సత్కరించింది. చిత్రకారుడు అంజి దశాబ్ద కాలం పాటు చిత్రకళలో ఎనలేని కృషి చేయడంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. జాతీయ స్థాయిలో వందలాది మందికి చిత్రకళలో శిక్షణ అందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక చిత్రకళ ప్రదర్శలు చేశారు. అంజి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చిత్రకళపై అభిరుచి ఉన్న విద్యార్థులకు క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ శిక్షణ ఇస్తుందన్నారు. ఆకొండి శంకరశాస్త్రి, మహేష్, మండల ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రతిభావంతుల తల్లిదండ్రులకు సత్కారం



తల్లిదండ్రులకు సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

తాళ్లరేవు: కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కళాశాల చైర్మన్ పోతుల వెంకట విశ్వం ఆధ్వర్యంలో ధృతి పేరిట నిర్వహించిన ప్లేస్‌మెంట్ విజయోత్సవ కార్యక్రమంలో అకడమిక్ టాపర్లతో పాటు, పలు కంపెనీలలో ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలు సాధించిన సుమారు 170 మంది విద్యార్థులను అభినందించి వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ డీన్, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు పరిశోధనకు అధిక ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఐశ్వర్య, అడ్వైజర్ సురేఖ, కైట్ ప్రిన్సిపాల్ రేవతి, కైట్ ఉమెన్స్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ గోపి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లపై వేధింపులను నిరసిస్తూ ధర్నా



డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గణేష్‌రావును డ్రైవర్ కమ్ కండక్టర్ సర్వీసు డ్యూటీ చేయాలని యాజమాన్యం వేధింపులకు గురి చేస్తోందని, డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లో డిపో ఉప కార్యదర్శి రంగ ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. యాక్సిడెంట్ అయిన డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసులకు మూడు సంవత్సరాల వరకు పంపించరాదని నిబంధన ఉందని అయితే అమలాపురం డిపో యాజమాన్యం కేజీరావును డ్రైవర్ కమ్ కండక్టర్ సర్వీసులకు వెళ్లాలని వేధిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ కలగజేసుకుని అతనికి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణపతి, డిపో అధ్యక్షుడు రేవు నారాయణరావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి పితాని మణిరాజు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, డ్రైవర్ నాగరాజు పాల్గొన్నారు.

పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గ నియామకం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొత్తలంక వలీబాబా దర్గా ఆవరణలో ఆదివారం మండల పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గం నియామకం జరిగింది. అధ్యక్షుడిగా కాండ్రేగుల రమణ, ఉపాధ్యక్షుడుగా దుగ్గుదుర్తి వెంకటేష్, కార్యదర్శిగా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా దుర్గారావుతో పాటు పలువురు సభ్యులను నియమించారు. దివి సూర్యనారాయణ, రుద్రాక్షల లోవరాజు, దైవల నాగరాజు, కముజు రామారావు, విత్తనాల శ్రీనివాసరావు, సంసాని పుల్లయ్య, ఇమ్మంది రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హంసవాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి హంసవాహనోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘం ఉత్సవదారులుగా జరిగిన ఈ హంస వాహనోత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం స్వామి వారిని హంసవాహనం పై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అమలాపురంరూరల్: అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జనసేన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశం నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగింది. రాజోలు, పి.గన్నవరం, కాకినాడ రూరల్, తాడేపల్లిగూడెం, నర్సాపురం ఎమ్మెల్యేలు దేవ వర ప్రసాద్, గిడ్డి సత్య సత్యనారాయణ, పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాసరావు, బొమ్మిడి నాయకర్, కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ బండారు శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి మంత్రి మనోహర్ హాజరై మాట్లాడారు. జనసేన పార్టీ బలోపేతానికి అంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్, కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, కొప్పుల మానస, కౌన్సిలర్లు ఏడిద శ్రీను, పడాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మి, గొలకోటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలను రెవెన్యూ పరిధిలోనే కొనసాగించాలి




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ దివాకర్

అమలాపురం రూరల్: రెవెన్యూ శాఖలో ఎప్పటి నుంచో కొనసాగుతున్న గ్రామ రెవెన్యూ అధికారులను రెవెన్యూ శాఖ పరిధిలోనే కొనసాగించాలని రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా సామ్యూల్ దివాకర్ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం కోనసీమ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దివాకర్ మాట్లాడుతూ వీఆర్వోల క్యాడర్‌ను తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్లేశ్వరరావు మాట్లాడుతూ తమ సమస్యలను జిల్లా సమావేశంలో తీర్మానం చేసి రాష్ట్ర సంఘానికి పంపించడం జరిగిందన్నారు. జిల్లా సహాయ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకట గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు స్వామినాయుడు, ఈవీవీ సత్యనారాయణ, డివిజన్, మండల నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

సమాన హక్కులు కల్పించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఎన్నో ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న షెడ్యూల్డు కులాలు(మైగ్రేషన్) వారికి రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా ఆరిజన్ ఎస్సీలతో సమానంగా హక్కులు కల్పించాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పత్రం పంపినట్లు ఆదివారం హైకోర్టు అడ్వకేట్, సోషల్ యాక్టివిస్టు అమీరున్నీషా ఓ ప్రకటనలో తెలిపారు. 1964 కంటే ముందుగా యానాంలో స్థిరపడిన ఎస్సీలకు మాత్రమే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నారని ఆ తర్వాత ఉపాధికోసం వచ్చి 6 దశాబ్దాలుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ఎస్సీలను వలసదారులుగా ముద్రవేసి వారికి రిజర్వేషన్లు వర్తింపజేయకపోవడంతో వారంతా నష్ట పోతున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఎస్సీలు ఉన్నప్పటికీ కేవలం పుదుచ్చేరిలో మాత్రమే 1964 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను అమలు చేస్తున్నారన్నారు. దీంతో వలసదారులైన ఎస్సీలు మిగిలిన ఆరిజన్ ఎస్సీలతో సమాన హక్కులు పొందలేకపోతున్నారని బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. పుదుచ్చేరి ఎల్జీ కైలాష్‌నాథన్, సీఎం రంగసామి తదితరులకు వినతిపత్రం పంపినట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

కొత్తపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని రిటైర్డ్ పీఈటీ, సత్యసాయి సేవా సమితి సభ్యుడు మారిశెట్టి సత్యనారాయణ, యోగా ఉపాధ్యాయుడు గోటేటి గంగాధరరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో ఆదివారం స్వామి వివేకానంద యోగాశ్రమం నిర్వాహకుడు, యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 100 మంది యోగా స్టూడెంట్స్ పాల్గొన్నారు. వివిధ యోగాసనాల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మారిశెట్టి సత్యనారాయణ, గోటేటి గంగాధరరావు, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు నల్లా గోపీ, పుత్సా కృష్ణకామేశ్వర్, సూరవరపు సత్యనారాయణమూర్తి వ్యవహరించారు.

శ్రీకాంత్ నియామకం పట్ల విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకుల హర్షం



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘం నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ రాష్ట్ర చేతి వృత్తుల విభాగం అధ్యక్షునిగా నియమితులైన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్‌కు జిల్లాకు చెందిన పార్టీ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార నాయకులు అభినందనలు తెలిపారు. విజయవాడలో శ్రీకాంత్‌ను జిల్లా నాయకులు శనివారం స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. అమలాపురం, కొత్తపేట నియోజకవర్గాలకు చెందిన విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల నాయకులు భరణికాన బాబు, కట్టోజు రామకృష్ణ, ర్యాలి రాజశేఖర్, టేకి సత్యకుమార్ తదితరులు శ్రీకాంత్‌ను కలిశారు. ఆయనను సత్కరించి అభినందించారు.

బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: ఇటీవల స్థల వివాదంలో పంతగంటి జయ రామకృష్ణ అనే వ్యక్తి కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన చేట్ల మాలతిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పరామర్శించారు. అమలాపురం కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమెను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించి బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆమెను తీవ్ర గాయాలపాలు చేసిన పొంతగంటి జయరామకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ప్రసాద్‌కు సూచించారు.

'కర్రసాము'లో అబ్బులు ప్రతిభ



బహుమతి అందుకుంటున్న అబ్బులు

ఆలమూరు: రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో మండలంలోని కలవచర్లకు చెందిన వీఆర్ఓ తాతపూడి అబ్బులు చక్కని ప్రతిభ కనబర్చారు. గుంటూరు జిల్లాలోని ఏసీఎంఈ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో వీఆర్ఓ అబ్బులు పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు. రాష్ట్ర క్రీడల సంఘ అధ్యక్షుడు సి.ఆదినారాయణ, కార్యదర్శి డి.అశోక్ బాబు, ఆర్గనైజర్ డీఎస్పీ కృష్టోపర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. అవార్డు గ్రహీత అబ్బులును పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.